www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 15 నవంబరు 2022 5

ఏలూరు



బుక్‌హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా గ్రంథాలయ ఆవరణలో గజేష్ బుక్‌హౌస్, విజయవాడ వారు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తకాలకు ప్రాధాన్యత తగ్గుతున్న తరుణంలో అన్ని వర్గాలకు సంబంధించిన పుస్తకాలను ఒక చోటకు చేర్చి పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. నిర్వాహకులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు సాహిత్యాన్ని అందించాలన్న ఉద్దేశంతో, ప్రజల దృష్టి పుస్తకాలవైపు మళ్లించాలన్న అభిప్రాయంతో ఈ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం డిస్కౌంట్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చీర్ల పద్మశ్రీ, సెక్రటరీ శేఖర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


రూటు మార్చి.. ఏమార్చి..!

రేషన్ బియ్యం పక్కదారి
వినియోగదారులకంటే ముందుగానే మాఫియా చేతుల్లోకి
అధికారుల తీరుపైనా అనుమానాలు
కాకినాడకు తరలింపు..!

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రేషన్‌బియ్యం పక్కదారి పడుతోంది. పగలూ, రాత్రి తేడా లేకుండా బహిరంగంగానే జిల్లా సరిహద్దులు దాటి కాకినాడలోకి ప్రవేశిస్తోంది. అక్కడ నుంచి దేశ, విదేశాలకు ఎగుమతి అవుతుంది. అధికమొత్తం కాకినాడ నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతుండగా మిగిలిన మొత్తం భూమి గుండ్రంగా ఉన్నట్లు తిరిగి మిల్లర్ల వద్దకే చేరుతోంది. దానికే పాలిష్‌పెట్టి సన్న బియ్యం పేరుతో కొందరు మిల్లర్లు మాయాజాలం చేస్తుండగా మరికొందరు లెవీపేరుతో ప్రభుత్వానికే తిరిగి అంటకడుతుండడం గమనార్హం.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరుతోపాటు పెదపాడు, దెందులూరు, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కామవరపుకోట, జీలుగుమిల్లి, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, ఆచంట, నరసాపురం వంటి ప్రాంతాల్లో రేషన్ మాఫియా రాజ్యమేలుతోంది. ఈ ప్రాంతాల్లోని రేషన్ మాఫియా స్థానికంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే చిరువ్యాపారులను, కొందరు యువకులను తమకు ఏజెంట్లుగా నియమించుకున్నారు. వారిద్వారా రేషన్ బియ్యం కొనుగోలును గ్రామాల్లో, వీధుల్లో చేయిస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని చిన్నపాటి మూటలతో ద్విచక్రవాహనాల ద్వారా తమ గోదాములకు తరలిస్తున్నారు. దీనికిగానూ కిలో బియ్యాన్ని ఏజెంట్లు రూ.10 నుంచి రూ.12కు వినియోగదారుల నుంచి కొనుగోలు చేస్తుండగా వీరి వద్ద నుంచి పెద్ద వ్యాపారులు కిలో రూ.15 నుంచి రూ.17కు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాముల్లో నిల్వ చేసి లారీల ద్వారా కాకినాడ సమీపంలో ఉన్న మండపేట పరిసర ప్రాంతాల్లోని కొందరు మిల్లర్లకు సరఫరా చేస్తున్నారు. వారు అక్కడ వాటిని నిల్వ చేసి పాలిష్ పెట్టడంతో పాటుగా బాయిల్డ్ చేస్తున్నారు. అనంతరం వాటికి బిల్లులను సృష్టించి కాకినాడలోని పోర్టు మార్గంద్వారా ఇతర దేశాలకు కిలో రూ.26 నుంచి రూ.36కు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రతిరోజూ జిల్లా నుంచి సుమారు పదుల సంఖ్యలో లారీలు ఈ మిల్లర్లకు చేరుతున్నాయి. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం కొసమెరుపు.



ఇటీవల ముసునూరు మండలంలో పట్టుబడిన రేషన్ బియ్యం

ఇ పోస్‌ల్లో తేడాలు..

ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో వినియోగదారునికి చేరకముందే రేషన్‌బియ్యం మాఫియా చేతుల్లోకి వెళ్తుంది. ప్రతినెలా ఈ విధంగా రేషన్ డిపోలకు నెలాఖరునాటికి రేషన్‌బియ్యం చేరుకోగానే అదేరోజు రాత్రి మాఫియా ప్రత్యేక వాహనాల్లో అందులో కొంతభాగం బియ్యాన్ని తరలించుకుపోతుంది. మిగిలిన బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్లు ఆ తర్వాత వచ్చిన వారికి బియ్యం లేవని చెబుతుండడం గమనార్హం. దీంతో వినియోగదారులు ఏం చేయాలో తెలియక మరో డిపో వద్దకు రేషన్ పంపిణీ వాహనం వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. రేషన్‌పంపిణీ వాహనదారులు కూడా దీనిలో తమవంతు పాత్రను పోషిస్తున్నారు. వారుకూడా ఎక్కడ వాహనం పెడుతున్నారో? ఏ రోజు ఏ సమయానికి పెడుతున్నారో కూడా సరైన సమాచారాన్ని ఇవ్వడం లేదు. దీంతో వినియోగదారులు చాలామంది రేషన్‌బియ్యం తెచ్చుకోవడం మానేస్తున్నారు. మరికొందరు వేలిముద్రలు వేసి డీలర్ల వద్దనే నగదు తీసుకుని వెళ్లిపోతున్నారు.

మిల్లర్ల ద్వారా తిరిగి లెవీగా సేకరణ..!

కొందరు మిల్లర్లు చిరువ్యాపారుల ద్వారా రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లలో వచ్చిన ధాన్యాన్ని నిల్వ చేసి దానిస్థానంలో లెవీగా ప్రభుత్వానికి నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. దీంతో తిరిగి ప్రభుత్వం ద్వారా అవే బియ్యం వినియోగదారులకు వస్తున్నాయి. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆదికి అధికధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ రేషన్‌బియ్యం మాఫియా వ్యవహారం కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకూ అందరికీ తెలిసినా ఎవరికి వారు తమకెందుకులే అనేరీతిలో వ్యవహరిస్తున్నారు. రేషన్ మాఫియా భారీస్థాయిలో ముడుపులు ముట్టజెబుతుండడంతో ఈ విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అంతేకాకుండా అడపాదడపా వాహనాలను పట్టుకుని కేసులు పెడుతున్నా నామమాత్రపు కేసులే పెడుతుండడంతో వారు తిరిగి ఇదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పీడీ యాక్టు పెట్టే అవకాశాలున్నా అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంపై పలువురు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ఆహార పంపిణీలో ప్రమాణాలు పాటించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సిహెచ్.విజయ్ ప్రతాప్ రెడ్డి పర్యటన

ప్రజాశక్తి - పెదపాడు

ఆహార పంపిణీలో ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సిహెచ్.విజయ్‌ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో విజయ్ ప్రతాప్ రెడ్డి, కమిషన్ సభ్యులు కిరణ్‌తో కలిసి పలు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని, శానిటేషన్ పరిస్థితులను, భోజనం వండే పరిస్థితులను, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులు, కోడిగుడ్లను అన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అప్పనవీడ, కలపర్రు, వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల ఆరోగ్య రీత్యా, చక్కటి మెనూ ద్వారా సిఎం జగన్ ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్దపై అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అందరికీ రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. తద్వారా అనారోగ్య కారణాలు ఎదుర్కోవచ్చని, పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యరీత్యా చక్కటి ఆరోగ్యం కలిగి ఉంటారని, ప్రభుత్వం సరఫరా చేసే బియ్యంలో ఫోర్ట్ ఫైడ్ రైస్ కలపడం వల్ల విద్యార్థుల్లో ఐరన్, బి విటమిన్ లోపాలను అధిగమించొచ్చన్నారు. తద్వారా మంచి ఆరోగ్యం పెంపొందించుకోవడం ద్వారా చదువుపై పూర్తి సమయాన్ని వెచ్చించవచ్చని తెలిపారు. వారు సందర్శించిన ఐదు పాఠశాలలు మధ్యాహ్న భోజనంపై పూర్తిస్థాయి సంతృప్తిని వ్యక్తం చేస్తూ, కలపర్రు పాఠశాలలో నూరు శాతం విద్యార్థులు భోజనం తినడం వల్ల రూ.పది వేలు విలువైన గిఫ్టును పాఠశాలకు పంపిస్తానని చెప్పారు. అనంతరం ఆ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు శ్రీకిరణ్, ఏలూరు ఉప విద్యాశాఖధికారి కె.లావణ్య, ప్రధానోపాధ్యాయులు రంగా ప్రసాద్, సురేష్, ఆదిలక్ష్మి రాజేశ్వరరావు, సావిత్రి, రవికాంత్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజు, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, సిడిపిఒ రాజశేఖర్, ఎంఇఒ నరసింహమూర్తి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైరన్

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు రోజులు పర్యటనలో భాగంగా సోమవారం ఏలూరు చేరుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సిహెచ్.విజయ్ ప్రతాప్ రెడ్డి స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో తన పర్యటన వివరాలను ప్రతాప్‌రెడ్డి వివరించారు. జిల్లాకు వచ్చే మార్గ మధ్యలో పలు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. సోమవారం ఏలూరు జిల్లాలో పర్యటించి మంగళవారం, బుధవారం పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. సందర్శన అనంతరం ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఏలూరులో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కమిషన్ సభ్యులు కిరణ్, డిఎస్ఒ ఆర్ఎస్ఎ స్ఎస్.రాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె.మంజుభార్గవి ఉన్నారు.

ఏలూరు మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సోమవారం రవి నేతృత్వంలో సిపిఎం నాయకులు మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ కోసం అనేక ఏళ్లుగా పునాదులు వేశారని గుర్తు చేశారు. ఎట్టకేలకు మెడికల్ కాలేజీని ప్రారంభిస్తున్నారన్నారు. మెడికల్ కాలేజీ త్వరితగతిన పూర్తిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేకుంటే మెడికల్ కాలేజీ పేరుతో ఏలూరు జిల్లా ఆసుపత్రి సేవలకు ఆటంకం కలుగుతుందన్నారు. మెడికల్ కాలేజీగా గుర్తించడంతో జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యుల పోస్టులు రద్దు చేశారన్నారు. దీనివల్ల రోజూ జిల్లా ఆసుపత్రిలో వైద్యం కోసం వస్తున్న రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదన్నారు. ఇన్ పేషంట్ సేవలకు కూడా ఆటంకం ఏర్పడి, విజయవాడ, గుంటూరుకు రోగులను పంపిస్తున్నారని తెలిపారు. మెడికల్ కాలేజీ పూర్తిస్థాయిలో అభివృద్ధి అయ్యే వరకు రోగులకు ఇబ్బంది కలగకుండా వైద్యులను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పి.కిషోర్, కె.శ్రీనివాస్, పి.ఆది శేషు పాల్గొన్నారు.



మహాసభలో నాయకులు

కార్మిక చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం : సిఐటియు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కార్మిక చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, వాటిని పటిష్టంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు మొడియం నాగమణి డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు మండల మహాసభ స్తానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద జై భీమ్ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి వేముల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగమణి మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కారని, కార్మిక హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. అంగన్‌వాడీ, ఆశా, స్కీం బేస్డ్ కార్మికులకు రూ.26 వేల వేతనం అమలు చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పటిష్టంగా అమలు చేయాలని, ఆటో ట్రాలీ డ్రైవర్ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18, 19 తేదీల్లో ఏలూరులో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు మండల అధ్యక్షులుగా ఎం.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కెవివి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన, పాఠశాల, భవనిర్మాణ కార్మికులు, ఆటో, ట్రాలీ యూనియన్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తుమ్మల సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్మశాన వాటికల రక్షణకు చర్యలు

సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ ఏర్పాటు

నగర కమిషనర్ షేక్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని శ్మశానవాటిక స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. నగరంలోని హిందూ శ్మశాన వాటికలను సంబంధిత అధికారులతో కలిసి కమిషనర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ అశోక్‌నగర్‌లోని స్మృతివనం హిందూ శ్మశాన వాటికలో మృతదేహాల తరలింపు వాహనాల నిలుపుదల, స్థల ఆక్రమణలను గుర్తించి అధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఉచిత సేవలు పేరిట నగరంలో మృతుల కుటుంబీకుల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని కార్పొరేషన్ విధివిధానాలు అమలు చేయాలని హెల్త్ అధికారులకు కమిషనర్ సూచించారు. వెంకన్న చెరువు శ్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. మృతుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో పొందుపరచాలన్నారు. శ్మశాన వాటికలో సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి అవగాహన బోర్డులను ఏర్పాటు చేసి హెల్త్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ షాహిద్ సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అధికారులు డాక్టర్ మాలతి, డాక్టర్ గోపాల్ నాయక్, ఎసిపి సాంబశివరావు, డిఇ సత్యనారాయణ, ఎఇ సాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంజయ్, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు కోరుతూ ర్యాలీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక వికాస్ విద్యాసంస్థల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. లంచం తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వికాస్ విద్యాసంస్థల విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సోమవారం నిరసన తెలిపారు. విద్యార్థులు వికాస్ పాఠశాల ప్రాంగణం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. వికాస్ పాఠశాలకు అనుమతులు మంజూరు చేయాలని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బాలల దినోత్సవం రోజున విద్యార్థులు చేపట్టిన నిరసన ర్యాలీపై పట్టణ ప్రజలు చర్చించుకున్నారు. ఇటీవల పట్టణంలో వికాస్ పాఠశాలకు అనుమతులు ఇచ్చే వ్యవహారంలో విద్యాశాఖాధికారులపై పాఠశాల కరస్పాండెంట్ దురుసుగా వ్యవహరించారని అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను విద్య శాఖ అధికారులు లంచం అడిగి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వికాస్ పాఠశాల కరస్పాండెంట్ బహిరంగ ఆరోపణలు చేశారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయంశంగా మారింది. ఈ క్రమంలో బాలల దినోత్సవం రోజున విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించడం మరింత ఆసక్తిని కలిగించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గరికపాటి మహిళలకు క్షమాపణ చెప్పాలి : ఐద్వా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మహిళలను కించపరుస్తూ మాట్లాడిన గరికపాటి నరసింహరావు వెంటనే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) బుట్టాయగూడెం మండల కన్వీనర్ కారం రామలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో లక్షలాది మంది ప్రజానీకం అభిమానాన్ని సంపాదించుకున్న గరికపాటి నరసింహరావు ఇటీవల కాలంలో పదేపదే ఆడవాళ్ల అవయవాలను, ఆధునిక దుస్తులను అసభ్యకరంగా వర్ణిస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తక్షణం తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, మహిళా కమిషన్ జోక్యం చేసుకొని విచారణ జరిపించాలని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతిని ఆమె శరీరాన్ని ఏనుగుతో పోలుస్తూ మహిళ అని చూడకుండా అవహేళన చేయడం నేరమని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ఎవరూ చేసినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గరికపాటి నరసింహరావు మహిళలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ జోక్యం చేసుకొని విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేకపోతే మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు.

శరవేగంగా రోడ్లు, వంతెనల నిర్మాణం

రూ.23.40 కోట్ల పనులకు టెండర్లు పూర్తి
ఆర్అండ్‌బి డిఇ హరికృష్ణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రూ.23.40 కోట్ల వ్యయంతో రోడ్లు, వంతెనల నిర్మాణ పనులు టెండర్ల దశ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయని జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ ఆర్అండ్‌బి డిఇ హరికృష్ణ తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో చేపట్టనున్న రోడ్లు, వంతెనల నిర్మాణాలు, ఇతర పనుల వివరాలను ఆయన ప్రజాశక్తికి వివరించారు. పోతవరం- కొయ్యలగూడెం, కరాటం వై జంక్షన్ - జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయం సమీపం వరకూ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. బై నేరు వాగు బ్రిడ్జి నిర్మాణానికి మరోసారి టెండర్ వేయాల్సి ఉందన్నారు. గతంలో ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.2.80 కోట్ల నిధులు కేటాయించగా టెండరుదారులు ముందుకు రాలేదని తెలిపారు. ప్రస్తుతం రూ.3.5 కోట్ల వరకూ నిధులు పెంచడం వల్ల టెండరు ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు.

అలాగే ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు రూ.60 కోట్లతో రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. బూర్గంపాడు - అశ్వారావుపేట వరకూ 45 కిలో మీటర్లు, మేడేపల్లి - రెడ్డిగూడెం క్రాస్ రోడ్ వరకూ ఆరు కిలోమీటర్లు, బుట్టాయగూడెం - దొరమామడి 22 కిలో మీటర్లు, బర్రింకలపాడు - లంకాలపల్లి తొమ్మిది కిలో మీటర్లు, బయ్యనగూడెం - రెగులకుంట 18 కిలోమీటర్లు, రేపల్లి వాడ - పోలవరం తాలూకా ఆఫీస్ వరకూ 10 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు.



పట్టెనపాలెం వంతెన నిర్మాణానికి రూ.ఐదు కోట్లు కేటాయించగా గతంలో కాంట్రాక్టర్‌కు రూ.1.80 కోట్లు చెల్లించామని డిఇ తెలిపారు. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్‌ను తొలగించామని తెలిపారు. మిగతా రూ.3.20 కోట్లతో వంతెన నిర్మాణానికి టెండర్ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

రూ.9 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు

మరికొన్ని రోడ్ల నిర్మాణానికి రూ.తొమ్మిది కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని డిఇ తెలిపారు. కొయ్యలగూడెం నుండి కన్నాపురం ఆరు కిలో మీటర్లు, పొంగుటూరు - కన్నాయగూడెం మూడు కిలో మీటర్లు, రాజవరం-లక్కవరం 1.5 కిలో మీటర్లు, చేబ్రోలు-దేవులపల్లి తొమ్మిది కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

నేటి బాలలే రేపటి పౌరులు

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శ్రీ సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ నేటితరం బాలలే రేపటి పౌరులని, విద్యలో అగ్రగామిగా నిలవాలని, ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి అడ్మిన్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి కె.చక్రవర్తి, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్ఎస్.శేఖర్, ఎఆర్ డిఎస్‌పి కృష్ణంరాజు, ఎఆర్ ఆర్ ఎస్ఐ నరేంద్ర పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : స్థానిక ఆర్ఆర్ పేటలోని ఈదర సుబ్బమ్మదేవి స్కూలు ఆవరణలో బాలల దినోత్సవం ప్రధానోపాధ్యాయులు కుటుంబరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఖ్య అతిథులుగా శ్రీరామ్ చంద్ర ఇంజినీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ పూర్వ విద్యార్థి మురళీధర్ పండిట్ జవహరలాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్బమ్మ దేవి పూర్వ విద్యార్థులు పాఠశాలకు వాటర్ ప్లాంట్, వాల్ గేటు, ఎలక్ట్రానిక్ బెల్లు అందించారు. తొలుత ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పిచ్చుక ఆదిశేషు గీతాలను ఆలపించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జివిఎల్.నరసింహరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

చింతలపూడి : నేటిబాలలే, రేపటి పౌరులు అని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. పట్టణంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత జవహర్ లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో పట్టుదల ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజసుధాకర్, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మిర్యాల దిలిప్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక విద్యావికాస్ ప్రాంగణంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యా వికాస్ డైరెక్టర్ పి.సతీష్‌చంద్, కరస్పాండెంట్ వి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ వి.ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ పి.లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులకు బహుమతులను అందిస్తున్న ఎస్‌పి రవిప్రకాష్

నూజివీడు : భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హైస్కూలు ఆవరణంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించిన ప్రధానో పాధ్యాయులు డాక్టర్ భాగవతుల హేమలత మాట్లాడుతూ ఈనాటి చిన్నారులే రేపటి భావిభారత పౌరులన్నారు. ఉపాధ్యాయ బృందం సహకారంతో విద్యార్థులకు ప్రత్యేకంగా పౌష్టికాహారం తయారు చేసి అందించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు,,కేకులు పంపిణీ చేశారు.

చాట్రాయి : జవహర్ లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గోలి సత్యనారాయణరెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు చంటిబాబు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : బాలల దినోత్సవ వేడుకలను పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సూరవరం, తోటపల్లి ఎంపియుపి పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూరవరం సర్పంచి జి.వీరవెంకటేశ్వరరావు, ఇండేన్ గ్యాస్ అధినేత పి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు కె.ఆనంద్‌కుమార్, ఆగిరిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత పాల్గొన్నారు.

భూములు పేదలకు పంచాలి : వ్యకాస

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ వ్యవసాయ కార్మికుల స్థితిగతులు మారలేదన్నారు. పేదల కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున భూములు పంచాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో యంత్రాలు పెరగడంతో పేదలకు ఉపాధి లేదన్నారు. సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభలు 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు తుమ్మల సత్యనారాయణ, ముత్యాలమ్మ, యాగంటి సీత, రాజమండ్రి దానియేలు, ఎర్రంశెట్టి నాగేంద్ర, ఉడతా వెంకటేశు, అందుకుల ప్రభాకరరావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిధుల మళ్లింపు నిరూపిస్తే రాజీనామా చేస్తా

ఎస్‌సి కమిషన్ సభ్యులు ఆనంద్‌ప్రకాష్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎస్‌సి సబ్ ప్లాన్ నిధుల మళ్లింపు, నిర్వీర్యం, దుర్వినియోగం జరిగినట్లు ఆధారాలతో నిరూపిస్తే తన పదవికి రాజీనామాతో పాటు రాజకీయాల నుంచి తప్పుకుంటానని షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొంతమంది ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయని, దుర్వినియోగమయ్యాయని దుష్ప్రచారం చేస్తున్నారని, అది సరికాదని చెప్పారు. సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లిస్తే, దుర్వినియోగం చేస్తే చూస్తూ ఉరుకోదన్నారు. బడ్జెట్‌లో ఎస్‌సి సబ్‌ప్లాన్‌కు కేటాయించిన నిధులే కాక అదనంగా పెద్దఎత్తున షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తుందన్నారు. విమర్శలు చేసే వారు చర్చకు రావాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూధనరావు, ఆర్‌డిఒ కె.పెంచెల కిశోర్, ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్, జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యులు నేత అజయ్ బాబు, పల్లెం ప్రసాద్, షెడ్యూల్డ్ కులాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా రహదారి విస్తరణ పనులు

నివాసితులు లబోదిబో

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు-కత్తిపూడి 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కాంట్రాక్టు తరపున ప్రయివేటు సర్వేయర్లు, మండల సర్వేయర్లతో ఎలాంటి సంబంధం లేకుండా అడ్డగోలుగా చేస్తున్న సర్వే కారణంగా తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు మండలంలోని నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. మండల పరిధిలో పెదపాలపర్రు సమీపంలో ఉన్న కోజిలాన్ ఫ్యాక్టరీ వద్ద నుంచి జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమై మండలంలోని దాకరం గ్రామం వరకు జరుగుతున్నాయి. మండలంలో 14 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ప్రభుత్వం రైతుల నుంచి భూసేకరణ చేసింది. ఇందుకు రైతులకు గతేడాది నష్ట పరిహారం కూడా చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా, మండల సర్వేయర్లు వచ్చి గతేడాది మూడుసార్లుగా భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించి మార్కింగ్‌లు వేశారు. ఇంత వరకు బాగానే ఉంది. రెండు వారాల క్రితం కాంట్రాక్టర్ తరుపు ప్రయివేటు సర్వేలమంటూ, తాము ఢిల్లీ నుంచి వచ్చామని చెప్పడంతో రహదారి విస్తరణ పనులకు భూములు ఇచ్చిన రైతులు భయందోళనలకు గురవుతున్నారు. గతంలో మండల సర్వేయర్ వేసిన కొలతలు, మార్కింగ్‌లు చెల్లవంటూ చెప్పి



అడ్డగోలుగా వేసిన సర్వే మార్కింగ్‌ను చూపిస్తున్న రైతు

మరో రెండు గజాల మేర లోపలి వరకు స్థలం ఉందంటూ వచ్చి మార్కింగ్‌లు వేయడంతో ఇటు దుకాణదారులు, అటు రైతులు తీవ్ర అందోళన చెందుతున్నారు. ముదినేపల్లిలోని అంబేద్కర్‌కాలనీ నుంచి కైకలూరు రోడ్డులో రంగాపురం వరకు కిలోమీటర్ పొడవున రైతుల నుంచి, దుకాణదారుల నుంచి సంబంధిత శాఖల అధికారులు భూసేకరణ చేశారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలో ఉన్న దుకాణాలు, నివేశన స్థలాలు, వ్యాపార సముదాయాలు, పక్క భవనాలు తొలగించాల్సి ఉంది. మళ్లీ ఇప్పుడు కాంట్రాక్టర్ తరుపు ప్రయివేటు సర్వేయర్లు వచ్చి కొత్తగా కొలతలు కొలచి మార్కింగ్‌లు వేయడంతో తాము ఆదనంగా భూమిని కోల్పోతున్నట్లు సిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి ఇంకా భూమి కావాల్సి వస్తే నష్ట పరిహారం చెల్లించి తీసుకోవాలి గాని, కాంట్రాక్టు తరపు ప్రయివేటు సర్వేయర్లను పంపి దౌర్జన్యంగా ఇంటిలో ఎవరూ లేని సమయంలో వచ్చి మార్కింగ్ చేయడం ఏంటని సిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. అంబేద్కర్ కాలనీలో 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం దళితులకు ఇచ్చిన ఇళ్ల వరకు సర్వే మార్కింగ్ వచ్చింది. అసైన్డ్ స్థలాలంటూ దళితులకు ఎలాంటి నష్ట పరిహారం చెల్లించకుండా అధికారులు లాగేసుకున్నారని దళితులు ఆరోపిస్తున్నారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు కట్టుకున్న వారికి నష్ట పరిహారం చెల్లించకుండా, కేవలం అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలగించేందుకు అయ్యే ఖర్చు మాత్రమే ఇవ్వడం దుర్మార్గమని దళితులు, నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేకపోతే దళిత సంఘాల ఆధ్వరంలో త్వరలో ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పలువురు దళిత నాయకులు హెచ్చరిస్తున్నారు.

కాంట్రాక్టు సర్వేయర్లను అడ్డుకోండి
సర్వేయర్ శీలం రాజశేఖర్‌రెడ్డి

ఈ విషయమై మండల సర్వేయర్ శీలం రాజశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం గతంలో జిల్లా, మండల సర్వేయర్లు, ఆర్‌అండ్‌బి అధికారుల సమక్షంలో భూసేకరణ చేసి సర్వే చేసి మార్కింగ్‌లు వేశామన్నారు. కాంట్రాక్టు తరపు ప్రయివేటు సర్వేయర్లు వచ్చి కొలతలు కొలిచి మార్కింగ్‌లు వేస్తే సిర్వాసితులు అడ్డుకొని తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

సౌకర్యాలు కల్పించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక 29వ డివిజన్ కుమ్మరిరేవు (భగత్ సింగ్ నగర్)లో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన స్పందనలో సిపిఎం కుమ్మరి రేవు శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఏలూరు టూ టౌన్ ప్రాంతంలో పేదలకు సిపిఎం పోరాటంతో 2002లో ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. సుమారు వెయ్యి కుటుంబాలు అక్కడ నివసిస్తున్నాయన్నారు. ఇప్పటికీ 20 సంవత్సరాలు అవుతున్నా ఆ ప్రాంతంలో ప్రజలకు రోడ్లు, వీధి లైట్లు, మంచి నీటి కనెక్షన్లు లేవన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కుమ్మరి రేవు శాఖ కార్యదర్శి జి.యేసుబాబు, పార్టీ నాయకులు వివివిఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

18 నుంచి సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - నిడమర్రు

ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఏలూరు నిర్వహించే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. నిడమర్రు మండల కమిటీ సమావేశం హరికుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ ఏలూరులోని కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుదారులందరికీ పామాయిల్ మొక్కలు ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

దరఖాస్తు చేసుకున్న వారందరికీ పామాయిల్ మొక్కలు పంపిణీ చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు ఎం.వసంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పామాయిల్ రైతులు తహాశీల్దార్ కార్యాలయం వద్ద స్పందనలో తహాశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎం.వసంతరావు మాట్లాడుతూ ప్రాధాన్యత ప్రకారం మొక్కలు సరఫరా చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.కాలేషా, డి.కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శులు పుల్లూరి సోమశేఖర్, తోర్లపాటి బాబు, పామాయిల్ రైతులు బి.నారాయణరావు, జె.నాగేశ్వరరావు, టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు దారుణం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

50 నుంచి 60 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న స్థలంలో పేద ప్రజలను ఇల్లు ఖాళీ చేయాలని చెప్పడం దారుణమని సిపిఎం ఏలూరు జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మొడియం నాగమణి, సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు అన్నారు. మండలంలోని బయ్యన్నగూడెం, ఎర్రంపేట, కన్నాపురం గ్రామాల్లో ప్రభుత్వ భూములు చెరువు పక్కన నివాసం ఉంటున్న పేదలకు ఏడు రోజుల్లో ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారన్నారు. ఆ బాధితులను సిపిఎం బృందం సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మొడియం నాగమణి, శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ 50, 60 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న పేదలను ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. పేదవారికి ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని, లేకపోతే పోరాటం చేస్తామని చెప్పారు. బృందంలో గుర్రం నాగరాజు, శ్రీను, నటకసాల పెద్దిరాజు, చాపల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎఇ కుటుంబానికి కమిషనర్ పరామర్శ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్ నాగిరెడ్డి రామారావు కుటుంబాన్ని సోమవారం కమిషనర్ షాహిద్ పరామర్శించారు. రామారావు సతీమణి లక్ష్మావతి (45) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. కమిషనర్ లక్ష్మావతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి మనోధైర్యంగా ఉండాలని కమిషనర్ షాహిద్ పేర్కొన్నారు. రామారావుకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

ప్రజాశక్తి - కలిదిండి

సమస్యల పరిష్కారంలో సర్పంచి చొరవ చూపాలని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. కలిదిండి పంచాయతీ కార్యాలయంలో సర్పంచి మసిముక్కు మారుతీప్రసన్న ఏడాది విజయోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాలకవర్గం ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. గతంలో సర్పంచిగా ఉన్న మహిళ చనిపోవడంతో ఏడాది క్రితం ఎన్నికలు నిర్వహించగా మారుతీప్రసన్న సర్పంచిగా గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ముత్తిరెడ్డి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్ పాల్గొన్నారు.

'ప్రజలను మోసగించిన వైసిపి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చి వాటిలో గృహాలు నిర్మించి ఇస్తామని వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ చెర్రీ బాలరాజు అన్నారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో మండల అధ్యక్షుడు తోట రవి ఆధ్వర్యంలో జగనన్న ఇంటి స్థలాల గృహ నిర్మాణాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సుమారు 54 నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఊరికి చివర పనికిరాని భూములు ఇచ్చారన్నారు. వైసిపి ప్రభుత్వం పేదలను మోసం చేసిందన్నారు.

నేరాలు-ఘోరాలు

వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

రోడ్డుపై ఉన్న గుంతల్లో పడి ఇద్దరు వ్యక్తులు గాయాలపాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన లక్ష్మణ, శేషు ఇరువురు బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం సత్తుపల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో పాత చింతలపూడి వద్దకు వచ్చేసరికి రోడ్డుపై గోతులు అధికంగా ఉండడంతో బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఇద్దరిని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లింగపాలెం మండలం సుందరరావుపేటకు చెందిన కాట్రు థామస్ (45) ప్రగడవరం నుంచి తమ గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఫాతిమాపురం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆస్తి కోసం మనవడి దాడి

పరిస్థితి విషమించి వృద్ధురాలు మృతి


ప్రజాశక్తి - నూజివీడు

ఆస్తి కోసం మనవడి డాడిలో ఓ వృద్ధురాలి మృతి చెందిన ఘటన మండలంలోని పల్లెర్లమూడి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు సొంగ జయమ్మపై ఆస్తి కోసం రెండు రోజుల క్రితం తన మనమడు వంశీ విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన వృద్ధురాలు జయమ్మను స్థానికులు 108 అంబులెన్సులో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వృద్ధురాలు పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు తెలిపారు. దాడికి పాల్పడిన నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

కైకలూరు రూరల్ : గ్రామాల్లో గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కేసులు తప్పవని ఎస్ఐ బి.రాంబాబు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఇబి ఆధ్వర్యంలో నాటుసారా, బెల్ట్ షాపుల అమ్మకాలపై దాడులు నిర్వహించారు. పందిరిపల్లిగూడెం గ్రామ పరిధిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న బలే రామలక్ష్మిని మద్యం సీసాలు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 15 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న కొండపల్లి పరమేశ్వరరావు వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ఏలూరు బాలల గ్రంథాలయంలో...



ముదినేపల్లిలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న సర్పంచి కైకమ్మ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు బాలల గ్రంథాలయంలో సోమవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు, ఆర్ ఆర్ పేట వెంకటేశ్వర దేవాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కురుళ్ల రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 20వ తేదీ వరకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎ.శోభ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు గుడిమెట్ల అచ్యుత, తిరుపతి రమేష్‌బాబు, చెన్నా వెంకటరామయ్య, జిల్లెలముడి వివి.ప్రసాదరావు, ఈస్టర్న్ స్ట్రీట్ మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయులు స్థానిక ఎల్‌బిసి స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో సోమవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. మండలంలోని గురజలో కూడా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

ఉంగుటూరు : విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలను ఎంపిపి గంటా శ్రీలక్ష్మి ప్రారంభించారు. చేబ్రోలు బాల సరస్వతి మండల శాఖ గ్రంథాలయంలో సర్పంచి రాంధె లక్ష్మీసునీత, లైబ్రేరియన్, పాల్గొన్నారు. ఉప్పాకపాడు పాఠశాల విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

చాట్రాయి : చాట్రాయి గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచి దామెర ఉష, అతిథులుగా ఎంపిటిసి సభ్యులు సంకు శివకుమారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోలి సత్యనారాయణరెడ్డి, మెయిన్ పాఠశాల ఉపాధ్యాయులు జి.రాము, సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రు శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను నిడమర్తి రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాజీ సర్పంచి ఇంటి ఉదయభాస్కర్, స్కూల్ అసిస్టెంట్ శానం శ్రీనివాస్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జానకి రామరాజు, గ్రంథాలయ పాలకులు బాలరాజు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని సర్పంచి ముప్పిడి విజయ కుమారి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని సర్పంచి ముప్పిడి విజయ్ కుమారి జ్యోతి ప్రజ్వలన చేయగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మేకల అన్నవరం నెహ్రూ చిత్రపటానికి, మదన గోపాల స్వామి దేవస్థానం ఛైర్మన్ ముద్దు గోపాలకృష్ణ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి చినబాబు, గ్రంథాలయ అధికారి యు.రాముడు పాల్గొన్నారు.

కలిదిండి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్ సోమవారం ప్రారంభించారు. గ్రంథాల య పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిటిసి మహమ్మద్ సఫయ తుల్లా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూర్తి, శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్, గొరిపర్తి వెంకట రెడ్డి, సాహితీ మిత్రులు పాల్గొన్నారు.


ఆగిరిపల్లి : గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి జె.జగన్మోహనరావు అన్నారు. ఆగిరిపల్లి శాఖాగ్రంథాలయంలో జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు సిహెచ్.విక్టర్‌బాబు, వార్డు సభ్యులు ఆర్.సాంబశివరావు, వైద్యాధికారి ఆశాజ్యోతి, గ్రంథాలయాధికారి డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లోని విద్యా సంస్థల్లో బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డిగ్రీ, జూనియర్ కళాశాలలో, భాష్యం, శ్రీ చైతన్య పాఠశాలలో, స్థానిక శాఖ గ్రంథాలయంలో వేడుకలు నిర్వహించారు. సాహితీ మిత్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

సహకార సంఘ సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కె.జగ్గవరం సహకార సంఘ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు అన్నారు. 14 నుంచి 20 వరకు జరుగుతున్న సహకార వారోత్సవాల సందర్భంగా స్థానిక సంఘం ఆవరణలో చైర్ పర్సన్ మధు సోమవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థ ఏర్పాటు ద్వారా రైతులకు ఆర్థికాభివృద్ధి చేకూరిందన్నారు. ప్రస్తుతం సంఘం ఆధ్వర్యంలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో



జెండా ఆవిష్కరిస్తున్న ఛైర్‌పర్సన్ మధు

వంటిపల్లి వెంకటేశ్వరరావు, రైతులు రాయపాటి కిశోర్, వంటిపల్లి తారకం, ముత్తయ్య, సిఇఒ తనగాల వీరవెంకయ్య పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిబంధనలకు విరుద్ధంగా హోటల్లో గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగాన్ని అరికట్టాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా జాయింట్ సెక్రటరీ కె.ప్రసాద్ కోరారు. ఈ మేరకు తహాశీల్దార్ స్లీవజోజికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కె.ప్రసాద్ మాట్లాడుతూ రాయితీలో సరఫరా చేస్తున్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను పట్టణంలో కొన్ని హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల స్థానంలో గృహ వినియోగ సిలిండర్లను వినియోగిస్తున్న హోటల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై తహాశీల్దార్ స్లీవజోజీ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎఎంసి అభివృద్ధికి కృషి చేయాలి

కైకలూరు రూరల్ : వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం నూతన కమిటీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్ పర్సన్ దండే పుష్పలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో యార్డు చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ముదినేపల్లి : విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకొని ఆటల పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ఎస్ఐ షణ్ముఖసాయి ఆధ్వర్యంలో ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఇటీవల పోలీసులు విద్యార్థులకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో నైపుణ్యం కనబరచినవారికి సోమవారం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ డిఎన్ఆర్ హాజరయ్యారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయని ఎంపిపి అడవి కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా సంబరాలను ఆయన సోమవారం ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే భావనతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. కబడ్డీ క్రీడా ప్రాంగణాన్ని సీనియర్ నాయకులు తలారి జాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సతీష్ పాల్గొన్నారు.

పాస్టర్లు ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పాస్టర్లు అందరూ ఐక్యంగా ఉండాలని మండల యునైటెడ్ పాస్టర్ల అసోషియేషన్ సంఘ అధ్యక్షులు జి.జ్ఞాన్‌రాజు అన్నారు. మండలంలోని మర్రిగూడెంలో సోమవారం యుపిఎ గౌరవ అధ్యక్షులు కురసం నిరీక్షణరావు అధ్యక్షతన యుపిఎ మండల సహవాస సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జ్ఞాన్ రాజు, ముఖ్య ప్రసంగీకులుగా పాస్టర్ డానియల్ రాజ్ హాజరయ్యారు. రానున్న రోజుల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు ప్రణాళికలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుపిఎ గౌరవ సలహాదారుడు సిహెచ్.హెూషేయ, జాయింట్ సెక్రటరీ సిహెచ్.రమేష్, ప్రసన్నరాజు,పాల్గొన్నారు.

గుండుగొలను యుబిఐలో అవినీతి..!

'స్పందన'లో బాధితుని ఫిర్యాదు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దెందులూరు మండలం గుండుగొలను గ్రామంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో డ్వాక్రా రుణాల్లో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన తొక్కుడుబియ్యపు సుమన్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఏలూరులోని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. తన తల్లి విమలకుమారి కొంతకాలం క్రితం మృతి చెందడంతో ఆమె తీసుకున్న రుణాన్ని తాను బాధ్యతగా తీసుకుని బ్యాంకుకు చెల్లిస్తున్నానని, గతేడాది ఎనిమిదో నెలలో తన తల్లి ఉన్న గ్రూపువారు రూ.10 లక్షలు రుణం కోసం దరఖాస్తు చేయగా ఒకరు చనిపోవడంతో రూ.తొమ్మిది లక్షలే రుణాన్ని ఇచ్చారని తెలిపారు. దాన్ని గ్రూపులో ఉన్న 11 మంది పంచుకున్నారని, దానికిగానూ నెలకు రూ.27 వేలు చొప్పున వాయిదాలు చెల్లిస్తున్నామని చెప్పారు. అయితే 14 నెలలు ఆ విధంగా చెల్లించిన తర్వాత ఇప్పుడు గ్రూపువారు రూ.10 లక్షలు రుణం తీసుకున్నారని, దానికిగానూ నెలకు రూ.30 వేలు చొప్పున చెల్లించాలని ఆ బ్యాంకు మేనేజరు చెబుతున్నారని తెలిపారు. దీనిపై తాము ప్రశ్నిస్తే ఓ బయట వ్యక్తిద్వారా తమ బ్యాంకు అకౌంట్‌లో రూ.మరో లక్ష వేశారని, బయట వ్యక్తులు రూ.లక్ష తమ డ్వాక్రా గ్రూపులో ఎలా వేస్తారని ఆయన ప్రశ్నించారు. అక్కడితో ఆగకుండా తమ గ్రూపు మూలధనంలోని పొదుపులోని నగదును కూడా కట్ చేశారని చెప్పారు. ఈ విధంగానే మిగిలిన గ్రూపుల్లోనూ చోటు చేసుకుందని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.